సహకరించాల్సిన వారే సమరమంటే ఎలా?

- ఎవరి మీద మీ యుద్ధం?
- మనమంతా కలిస్తేనే ప్రభుత్వం
- పార్టీల కుట్రలో పావులుగా మారకండి
- సమస్యలుంటే కూర్చుని చర్చించుకుందాం
- ఉద్యోగ సంఘాలనుద్దేశించి సిఎం రేవంత్ వ్యాఖ్యలు
- 'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్-2025' అవార్డుల అందజేత


పోలీసులకు అవార్డులు అందిజేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తనను కోసినా ఆదాయానికి మించి ఏమీ చేయలేనని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేసిన వ్యక్తి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో హాయిగా పడుకున్నారని మాజీ సిఎం కెసిఆర్‌నుద్దేశించి విమర్శలు గుప్పించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వానికి సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలు.. ఇక సమరమే అంటూ హెచ్చరించడం సరికాదన్నారు. 'వారి సమరం ఎవరిపైన? తెలంగాణ ప్రజలపైనా వారి యుద్ధం...?' అని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఓ మీడియా సంస్థ నిర్వహించిన 'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్-2025' అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగ సంఘాలనుద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నందుకు సమరానికి కాలు దువ్వుతున్నారా? అని ప్రశ్నించారు. జీతభత్యాల కోసం ప్రతీనెలా రూ.ఏడు వేల కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. గత పాలకులు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద ఇవ్వాల్సిన రూ.8,500 కోట్లను బకాయి పెట్టి వెళ్లారని వాపోయారు. ఆ విధంగా బకాయి పెట్టిన పార్టీలే, ఇప్పుడు తమ ప్రభుత్వంపైన ఆరోపణలు గుప్పిస్తున్నాయని విమర్శించారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం పదహారు నెలల కాలంలో రూ.30 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని సిఎం గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అని చెప్పి... ఆ శాఖకు చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టి పోయిందని తెలిపారు. విద్యుదుత్పత్తి కోసం బొగ్గును కొనుగోలు చేసి, సింగరేణికి డబ్బులివ్వకుండా ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. ప్రాజెక్టులు కట్టామని చెబుతున్న వారు... కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా మొండి చేయి చూపారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ హయాంలో 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారు.. ఇంతకంటే దుర్మార్గం ఇంకోటి ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇలాంటి వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని ఉద్యోగ సంఘాలకు సిఎం సూచించారు. 'సమస్యలేమైనా ఉంటే పరిష్కరించుకుందాం, కూర్చుని మాట్లాడుకుందాం...' అని విజ్ఞప్తి చేశారు. అందరూ కలిస్తేనే ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. 'మనం పాలకులం కాదు, సేవకులం... మనం ఉన్నది సమరం చేయటానికి కాదు, ప్రజలకు సేవ చేయటానికి...' అని సూచించారు. ప్రజలపై యుద్ధం చేసిన వాళ్లెవరూ బాగుపడిన దాఖలాల్లేవని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే రాజకీయ పార్టీల కుట్రలో పావులు కావద్దంటూ ఉద్యోగ సంఘాలు, వాటి నేతలకు ఆయన హితవు పలికారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన ఉద్యోగులు, సంఘాల నేతలు బాధ్యత మరిచి వ్యవహరిస్తే తెలంగాణ సమాజం సహించబోదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేది ఒక కుటుంబం లాంటిదనీ, అందువల్ల దాని పరువును బజారున పడేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యల ద్వారా తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దని కోరారు. ఇప్పుడు సమరం కాదు.. సమయస్ఫూర్తి అవసరమని నొక్కి చెప్పారు.

స్వీయ నియంత్రణే పరిష్కారం...

అప్పులు తెచ్చైనా సరే.. సంక్షేమ పథకాలను అమలు చేద్దామంటే, కొత్త అప్పులు ఎక్కడా పుట్టటం లేదని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రభుత్వానికి స్వీయ ఆర్థిక నియంత్రణ తప్ప వేరే మార్గం, పరిష్కారం లేదని అన్నారు.

పోలీసుల కుటుంబాలను ఆదుకుంటాం...

పోలీసులు నూటికి నూరు శాతం శాంతి భద్రతలను కాపాడుతున్నారని సిఎం ప్రశంసించారు. దేశ సరిహద్దుల్లో సైనికుల మాదిరిగా వారు రాష్ట్రాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. ఇక్కడ శాంతి భద్రతలు బాగుండటం వల్లే ప్రపంచస్థాయిలో పెట్టుబడులను మనం ఆకర్షించగలుగుతున్నామని వివరించారు. పోలీస్ ఉద్యోగం కత్తిమీద సాములాంటిదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటోందని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు, ఎస్పీ, అడిషనల్ ఎస్పీల కుటుంబాలకు రూ.కోటిన్నర పరిహారంగా అందిస్తున్నామని వెల్లడించారు. పోలీసుల పిల్లల భవిష్యత్ కోసం 50 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. వారికి మంచి భవిష్యత్‌ను అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్, ట్రాఫిక్ అధికారులకు ముఖ్యమంత్రి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సిపిఎం బైక్ ర్యాలీ

మతోన్మాదుల ఆగడాలను అరికట్టాలి


- దళిత యువకునిపై దాడి అమానుషం : ఎ మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతోన్మాదుల ఆగడాలను అరికట్టాలని, దళిత యువకునిపై దాడి చేయడం అమానుషమని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఎల్లదాసునగర్‌లోని బాధితుడు ఊబిది అజయ్ ఇంటికి సోమవారం సిపిఎం బృందం వెళ్లి పరామర్శించింది. బాధితునితో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం అక్కడ నిర్వహించిన సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. బేడ బుడగ జంగాల దళిత యువకున్ని మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్, హిందుత్వ బజరంగ్‌దళ్ ముసుగులో ఉన్న ఉన్మాదులు మానవత్వాన్ని మరిచి విచక్షణారహితంగా దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తించిన ఈ దుండగుల పైన ఎస్‌పి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీ ప్రజల మీద, దళితులపైన అర్థరహితమైన దాడులు చేస్తూ.. ప్రజలను రెచ్చగొట్టి మతకల్లోలాలను సృష్టించి అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే బిజెపి, దాని అనుబంధ ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ లాంటి సంస్థల ఉద్దేశమన్నారు. అందుకు చేర్యాల ప్రాంతంలో జరిగిన ఘటననే నిదర్శనమన్నారు. ఒక దళితుడిని పావుగా ఎంచుకొని 'భారత్ మాతాకీ జై, జై శ్రీరామ్' అని నినాదాలు చేస్తూ ఆ యువకున్ని తాళ్లతో కట్టేసి చితకబాది బట్టలూడదీసి నగ్నంగా ప్రదర్శన చేయించడం దుర్మార్గమన్నారు. దీన్ని మేధావులు, ప్రగతిశీల వాదులు ఖండించాలన్నారు. కాగా దుండగులకు బెయిల్ మంజూరు చేయడం సరికాదని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పునరాలోచన చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, అమ్ముల బాల నరసయ్య, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, తాడూరి ప్రశాంత్, అత్తిని శారద చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, దూల్మిట పార్టీ మండల కార్యదర్శి పోరెడ్డి రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం'ను నిర్వీర్యానికి కాంగ్రెస్ కుట్రలు

- తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టుపెడుతున్న సిఎం : మధుసూదనాచారి
- బ్యారేజీలు కూలిపోవడం సిఎం ఆశయం : నీటిపారుదల రంగ నిపుణులు వి.ప్రకాశ్


మాట్లాడుతున్న మధుసూదనా చారి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం తన అసమర్థ పాలనను కప్పి పుచ్చుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోందని, పాలన చేతకాక, అభివృద్ధి చేయలేక తెలంగాణాను ఆగం చేస్తున్నారని మండలి బిఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ సిరికొండ మధుసుధనాచారి అన్నారు. సోమవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన 'కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు-వాస్తవాలపై చర్చ'లో ఆయన మాట్లాడారు. కాకతీయులను ఆదర్శంగా తీసుకున్న మాజీ సీఎం కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. పదేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటి ప్రయోజనాలు పొందామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలనే కుట్రలు చేస్తున్నారన్నారు. ఏపి సిఎంకి తెలంగాణ సిఎం ఏజెంట్ అనే విషయం అందరికి తెలిసిందేనని తెలిపారు. ఇద్దరు సిఎంల సమిష్టి ప్రయోజనాల కోసం ఈ ప్రాంత ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టు పెట్టి ప్రయోజనం పొందేందుకు కుట్రలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టును సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ ఏడాది తర్వాత నివేదిక ఇచ్చిందని, ఈ నివేదికలో పిల్లర్‌లకు మరమ్మత్తులు చేసి నీళ్లను ఆపవచ్చని పేర్కొందని తెలిపారు. నీటిపారుదల రంగ నిపుణులు వి.ప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బ్యారేజీలు కూలిపోవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం, ఆలోచన అని అన్నారు. ఎన్నికలకు ముందే మేడిగడ్డ బ్యారేజ్‌లో పిల్లర్ కుంగిపోవాలా, అందుకు బారీ శబ్దం రావడం ఏంటని ప్రశ్నించారు. టీఆర్ఎస్ వచ్చిన తర్వాతనే చంద్రబాబునాయుడు దేవాదుల ప్రాజెక్టును మొదలుపెట్టారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, నడిపెల్లి దివాకర్ రావు, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య, మాజీ జడ్పీ చైర్ పర్సన్లు దావ వసంత, జక్కు శ్రీ హర్షిణీ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు ఆధారంగా సాగు

- పామాయిల్ పంటలు పండించేందుకు రైతులు ముందుకు రావాలి
- అన్నం పెట్టే అన్నదాతలను కాపాడుకోవడం మా ప్రధాన లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


రైతు వేదికలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూసార పరీక్షలు చేసి, వాటికి అనుగుణంగా పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. పామాయిల్ పంటలు పండించేందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్నం పెట్టే అన్నదాతలను కాపాడుకోవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టంచేశారు. వికారాబాద్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు ముంగిట్లో.. వ్యవసాయ శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితోపాటు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. అత్యధికంగా పంటలు పండించే రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రైతులు ఆర్థికంగా మరింత ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు శాస్త్రీయ పరిజ్ఞానంతో పంటలు పండించాలని, యూరియా, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. రైతులు ఉద్యానవన పంటలను వేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులకు పంటబీమా వర్తింపచేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే రైతుబీమా, రైతు భరోసా కింద రూ.33 వేల కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. రైతులే నిజమైన శాస్త్రవేత్తలని, శాస్త్రవేత్తలు తయారుచేసిన విత్తనాలను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు ఆధునిక, సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేసే విధంగా శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన వంగడాలను అందించినట్లయితే నష్టాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. గతంలో ధరణి వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, రైతుల కష్టాలను తీర్చే దిశగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జానయ్య, అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, రైతు సంక్షేమ కమిటీ సభ్యులు సునీల్, జనార్దన్‌రెడ్డి, సైంటిస్టులు పాల్గొన్నారు.

టిజిఐఐసి మెడకు కంచ గచ్చిబౌలి భూ వివాదం

- అటవీ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు
- వేలాది చెట్ల నరికివేతలో నిబంధనలు పాటించలేదు
- రాష్ట్ర అటవీ శాఖ అధికారులపైనా కేంద్రం ఆగ్రహం
- వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కారని అభియోగం
- కేంద్ర సాధికారిక కమిటీకి రేపు నివేదిక సమర్పించనున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కంచ గచ్చిబౌలి భూముల వివాదం తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి) మెడకు చుట్టుకునేలా ఉందని తెలుస్తోంది. సర్వే నెంబర్ 25లోని 400 ఎకరాల భూముల్లోని వేలాది చెట్ల నరికివేతపై కేంద్ర అటవీ శాఖ సీరియస్‌గా ఉందని సమాచారం. వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ (వాల్టా), అటవీ సంరక్షణ చట్టం1980, వన్యప్రాణుల రక్షణ చట్టం1972ను ఉల్లంఘించిందని సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికారిక కమిటీ ప్రాథమికంగా గుర్తించిందని తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఢిల్లీలో సమావేశం కానున్న కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కంచగచ్చిబౌలి భూములపై సమగ్ర నివేదిక అందించనుంది. అనంతరం వెలువడే కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో గల 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జూన్‌లో జిఓ నెంబర్ 54 ద్వారా టిజిఐఐసికి అప్పగించింది. సదరు ప్రభుత్వ సంస్థ ఓ మధ్యవర్తి కంపెనీ ద్వారా భూములను తనఖా పెట్టి బాండ్ల ద్వారా రూ.10 వేల కోట్ల మొత్తాన్ని సేకరించింది. సంబంధిత స్థలంలో ఐటి, ఇతర పరిశ్రమల కోసం భూమిని అమ్మడం లేదా కేటాయింపులు చేయాలని టిజిఐఐసి నిర్ణయించింది. ఇందు కోసం భూమిని చదును చేసేందుకు అక్కడున్న చెట్లను తొలిగించింది. ఈ క్రమంలో అటవీ, వాల్టా చట్టాలను ఉల్లంఘించిందనేది ఒక ఆరోపణ. అయితే, ఈ భూములు హెచ్‌సియుకి చెందినవని మరో ఆరోపణ. ఈ విషయం హైకోర్టు, సుప్రీం కోర్టులకు చేరింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన కేంద్ర సాధికారిక కమిటీ ఇటీవల రాష్ట్రంలో పర్యటించి వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో జరగనున్న కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సమర్పించేందుకు కసరత్తు చేస్తున్నది. ఇందుకు సంబంధించి సీఎస్ ఇటీవల ఉన్నతాధికారులతో సమావేశమై సాధికారిక కమిటీకి సమర్పించే నివేదికపై చర్చించారు.

టీజీఐఐసీ మెడకు....

టీజీఐఐసీకి కంచ గచ్చిబౌలి భూములను బదిలీ చేశామని చెప్పేందుకు 26 జూన్ 2024న జారీ చేసిన ఉత్తర్వులో రాష్ట్ర ప్రభుత్వం ఎలియనేషన్ అనే పదాన్ని వాడింది. అయితే హక్కులు ఈ సంస్థకు బదిలీ అయ్యాయా? అనే అంశం ఎటూ తేలడం లేదు. తెలంగాణ రెవెన్యూ చట్టంలో ఎలియనేషన్ అనే పదం లేదు. భూమి, పట్టాదార్ పాస్‌బుక్‌లు, తెలంగాణ హక్కుల చట్టం 2020లో కూడా ఈ పదం లేదు. అందువల్ల సాంకేతికంగా యాజమాన్యం మారలేదని భావిస్తున్నారు. యజమాని కాని సంస్థ ఎలా చెట్లను తొలగించిందనే ప్రశ్నకు సమాధానం లేదు. వాల్టా, జీవవైవిధ్య, అటవీ సంరక్షణ చట్టాలను టీజీఐఐసీ ఉల్లంఘించిందని ప్రాథమికంగా గుర్తించిన, సాధికారిక కమిటీ అదే విషయాన్ని కోర్టుకు నివేదించిందని సమాచారం. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ లక్షణాలున్న ప్రాంతంలో చెట్లు కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. వన్య ప్రాణులున్న చోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించి అధ్యయనం చేయాలి. అటవీ భూమి కాదని నిర్ధారించిన తర్వాతే ఆ భూమిలోని చెట్లను తొలిగించాలి. వాల్టా చట్టం ప్రకారం ఒక చెట్టును తొలిగిస్తే రెండు నుంచి ఐదు చెట్లను నాటాలి. అందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఇవేమి పాటించకుండానే భూమిని స్వాధీనం చేసుకుని చట్టాల ఉల్లంఘనలకు పాల్పడిందని టీజీఐఐసీపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం టీజీఐఐసీ మెడకు చుట్టుకునేలా ఉందని సమాచారం.

నిబంధనలు ఉల్లంఘించలేదు: రాష్ట్ర ప్రభుత్వం

కంచగచ్చిబౌలి భూముల విషయంలో నిబంధనలు ఉల్లంఘించలేదని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులకు కూడా తెలిపింది. "ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 2004లో అప్పటి ప్రభుత్వం ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించింది. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో ఈ కేటాయింపును సర్కార్ రద్దు చేసింది. తెలంగాణ రెవెన్యూ రికార్డుల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు" అని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. కంచ గచ్చిబౌలి భూములు.. అటవీ భూములని ప్రభుత్వం సైతం ఎక్కడా నోటిఫై చేయలేదు. ఇది పూర్తిగా పరిశ్రమలు, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలం మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వ అంటోంది.

మిస్ వరల్డ్ ఏర్పాట్లు ఘనంగా చేయండి

- ఈవెంట్లు జరిగే చోట కట్టుదిట్టమైన భద్రత
- విద్యుత్, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు
- అన్ని విభాగాలూ సమన్వయంతో పని చేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిస్ వరల్డ్ 2025 పోటీలకు ఎలాంటి లోటు రాకుండా ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అందాల పోటీల ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో పర్యాటక శాఖ, పోలీసు, ఇతర విభాగాలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. విస్‌వరల్డ్ పోటీల ఏర్పాట్ల వివరాలను అధికారులు ఈ సందర్భంగా సిఎంకు వివరించారు. ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు పోటీల్లో పాల్గొంటున్నారనీ, వారందరికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆతిథ్యమివ్వాలని అన్నారు. పోటీదారులతోపాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు మూడు వేల మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని గుర్తు చేశారు. పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని చార్మినార్, లాడ్ బజార్, తెలంగాణ తల్లి, సెక్రెటేరియట్‌తో పాటు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో, అవసరమైన రవాణా వసతులు కల్పించాలన్నారు. అతిథులు సందర్శించే ప్రాంతాల్లో అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకెపి మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ల సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈవెంట్ జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలనీ, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జిహెచ్‌ఎంసితోపాటు హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ప్రభుత్వం తరపున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్‌లతో పాటు సిటీలోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ రాజ్యాంగ విరుద్ధం

- ఎల్‌సిజిటిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ రాజ్యాంగ విరుద్ధమని లోకల్ క్యాడర్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం (ఎల్‌సిజిటిఎ) తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం వీరాచారి, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీకాంతరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను గతంలో అనేక ముఖ్యమంత్రులు ఇచ్చిన జీవోలను హైకోర్టు, సుప్రీం కోర్టులు తిరస్కరించాయని గుర్తు చేశారు. ఆర్టికల్ 371-డీ ప్రకారం 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ చట్టం, రాష్ట్రపతి ఉత్తర్వులు-1975, రాష్ట్రపతి ఉత్తర్వులు-2018పై హైకోర్టులో స్టే ఉందని తెలిపారు. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీరాజ్ ఉపాధ్యాయులందరూ పంచాయతీరాజ్ జిల్లా సీఈవో పరిధిలో పనిచేయాలని పేర్కొన్నారు.

రైస్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులోని నేషనల్ హైవే 44 పక్కన సాయిగోపాల్ ఇండస్ట్రీస్‌లో సోమవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి లోపల ఉన్న ధాన్యమంతా కాలిపోయింది. స్థానిక నాయకులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో కొత్తకోట అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కార్పొరేట్లపై పన్నులు పెంచి వైద్యారోగ్యం, వ్యవసాయ రంగాలకు కేటాయించాలి
- కనీస వేతనం రూ.26 వేలివ్వాలి
- సార్వత్రిక సమ్మె నోటీసు అందజేసిన సిఐటియు నేతలు


సెర్ప్ సిఇఒకు సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలోని కార్పొరేట్లపై పన్నులు పెంచి పేదలకు కీలకమైన వైద్యారోగ్యం, వ్యవసాయ రంగాలకు ఆ నిధులను కేటాయించాలని సిఐటియు అనుబంధ సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆయా శాఖల ఉన్నతాధికారులకు సిఐటియు నేతలు సమ్మె నోటీసులను సోమవారం అందజేశారు.

టెక్స్ట్ బుక్ ముద్రణాలయంలో...

తెలంగాణ ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయంలో ఉన్నతాధికారులకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, తెలంగాణ ప్రభుత్వం టెక్స్ట్‌బుక్ ప్రెస్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్య సమ్మె నోటీసు అందజేశారు. విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలనీ, పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీని తగ్గించాలనీ, నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలనీ, 51 శాతం ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలనీ, పీఆర్సీని అమలు చేయాలని విన్నవించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ పెట్టిన 52 డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

తెలంగాణ గ్రామీణ ఉపాధి ఫీల్డు అసిస్టెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు తెలంగాణ గ్రామీణ ఉపాధి ఫీల్డు అసిస్టెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపాల్, ఎం.నారాయణగౌడ్ సమ్మె నోటీసు పంపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధించిన సర్క్యులర్ 4779 ఎత్తేసి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, వారికి పేస్కేలు వర్తింపజేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు నరేగా నుంచి ఇచ్చే రూ.8 వేల అలవెన్స్‌లను ఫీల్డు అసిస్టెంట్లకు వర్తింపజేయాలని విన్నవించారు.

తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో

తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసును పంపారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.గోపాలస్వామి, ఎస్వీ.రమ ఒక ప్రకటన విడుదల చేశారు. బీడీ కార్మికులకు 1000 బీడీలకు గానూ రూ.807 ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలకు 26 రోజుల పని కల్పించాలని విన్నవించారు. బీడీ ప్యాకర్స్, సార్టర్, ట్రెపిల్లర్, నెల వేతనాలు పొందే కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ చట్టాలని విధిగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నెలకు సరిపడా నాణ్యమైన ఆకు, తంబాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సెర్ప్ సిఇఒకు సమ్మె నోటీసు

సెర్ప్ సీఈఓకు తెలంగాణ మెప్మా రీసోర్స్‌పర్సన్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు పంపారు. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ.రమ, డి.శ్రీరేవతి ప్రకటన విడుదల చేశారు. ఆర్పీలకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. నేరుగా వారి ఖాతాల్లోనే వేతనాలు జమచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్పీలకు ఒకే రకమైన డ్రస్ కోడ్ ఇవ్వాలనీ, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోనూ సెర్ప్ సీఈఓకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, ఎస్వీ.రమ, కోశాధికారి సుమలత సమ్మె నోటీసు అందజేశారు. స్త్రీనిధి ప్రోత్సహకాలను గ్రామ సంఘాలకు ఇవ్వాలనీ, వీఓఏలకు గ్రామ సంఘం నుంచి రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలనీ, మూడు నెలలకోసారి వీఓఏ రెన్యూవల్ పద్ధతిని తీసేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ప్రకారం రూ.20 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.20 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వీఓఏలకు గౌరవ వేతనాలివ్వాలని విన్నవించారు.



పిల్లల్లో సృజనాత్మకతను పెంచే సమ్మర్ క్యాంప్

- బాలోత్సవ్ సమ్మర్ క్యాంప్ ప్రారంభంలో భూపతి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమ్మర్ క్యాంప్ పిల్లల్లో సృజనాత్మకతను, ఊహించే శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుందని తెలంగాణ బాలోత్సవ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం తెలంగాణ బాలోత్సవ సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వేసవిలో పిల్లల కోసం నిర్వహించే ఒక సరదా, వినోదభరితమైన శిబిరం సమ్మర్ క్యాంప్ అన్నారు. ఈ శిబిరాలలో పిల్లలు వివిధ రకాల ఆటలు, ఇతర కార్యకలాపాలలో పాల్గొంటారని, ఇవి వారిని సృజనాత్మకంగా, శారీరకంగా, మానసికంగా చురుకుగా ఉంచుతాయని అన్నారు. సమ్మర్ క్యాంప్‌తో వివిధ నైపుణ్యాలను నేర్చుకోవచ్చన్నారు. పాఠశాలకు, సమ్మర్ క్యాంప్‌కు స్పష్టమైన తేడా ఉందని తెలిపారు. నృత్యం, పాడడం, డ్రాయింగ్, క్రాఫ్ట్ ఇతర కళలు ఈ సమ్మర్ క్యాంప్‌లో నేర్చుకోవచ్చని చెప్పారు. అలాగే, పిల్లలు కొత్త స్నేహితులను ఏర్పరచుకోవచ్చని, ఒకరికొకరు సహాయం చేసుకోవడం నేర్చుకోవచ్చని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో నిర్వహించే కొన్ని కార్యకలాపాలను వివరించారు. పిల్లలు వివిధ రకాల కళలు, క్రాఫ్ట్‌లలో పాల్గొనడానికి అవకాశం ఉంటుందన్నారు. కొత్త విషయాలు నేర్చుకోవచ్చని, పిల్లలు బహిరంగంగా విహరించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్ సోమయ్య, కవయిత్రి రూపా రుక్మిణి, దివ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద అంబర్‌పేట సబ్‌రిజిస్ట్రార్‌పై దాడికి టిఎన్‌జిఒ ఖండన

- నిందితులను శిక్షించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధినిర్వహణలో ఉన్న పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ ఎల్ రవీందర్‌పై శ్రీనివాస్‌యాదవ్ అనే వ్యక్తి దుర్భాషలాడుతూ పాశవికంగా దాడి చేయడాన్ని టిఎన్‌జిఒ కేంద్ర సంఘం తీవ్రంగా ఖండించింది. సబ్‌రిజిస్ట్రార్‌పై అభ్యంతరాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలనీ, దాడులు హేయమైన చర్య అని విమర్శించింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అదనపు ఇన్‌స్పెక్టర్ జనరల్ వెంకట రాజేశ్‌ను సోమవారం టిఎన్‌జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేని ముజీబ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలనీ, చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం డిజిపిని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి క్రిమినల్ కేసులను నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, హైదరాబాద్‌నగర అధ్యక్షులు కె శ్రీకాంత్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. పెద్దఅంబర్‌పేట సబ్‌రిజిస్ట్రార్ ఎల్ రవీందర్‌పై శ్రీనివాస్‌యాదవ్ అనే వ్యక్తి దుర్భాషలాడుతూ పాశవికంగా దాడి చేయడాన్ని టిజిఒ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ విధివిధానాల ప్రకారం అధికారులు విధులను నిర్వహిస్తారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ బి శ్యామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కానీ అమానవీయంగా తిడుతూ భౌతిక దాడులకు పాల్పడటం సరైంది కాదని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విడిసిలను రద్దు చేయాలి

- అరాచకవాదులపై చర్యలు తీసుకోవాలి
- ఎస్‌వికె వెబినార్‌లో పైళ్ల ఆశయ్య, పెద్ది వెంకట్రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (విడిసి)లను రద్దు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కో కన్వీనర్ పైళ్ల ఆశయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారుడు పెద్ది వెంకట్రాములు డిమాండ్ చేశారు. దీని కోసం గతంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి తెచ్చిన జిఒను పునరుద్ధయరించాలని కోరారు. గ్రామ అభివద్ధి కమిటీలను రద్దు చేసేందుకు, వారిపై చర్యలు తీసుకునేలా కాంగ్రెస్ సర్కార్ కొత్త జిఒను కూడా తీసుకురావాలని సూచించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయంలో సోమవారం "విడిసిల ఆగడాలు - అరికట్టలేని ప్రభుత్వాలు" అనే అంశంపై నిర్వహించిన వెబినార్‌లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ ఎవరైతే అడిగినంత డబ్బులివ్వరో, ఆ కులాల వారిని విడిసిలు బహిష్కరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలు, ధనవంతులపై ఎలాంటి చర్యలుండవని తెలిపారు. విడిసిలు చేస్తున్నదని అన్యాయమని తెలిసినా ఆయా గ్రామాల్లో మిగిలిన కులాలు బహిరంగంగా బాధితులకు మద్దతుగా నిలబడలేకపోతున్నారని తెలిపారు. దీంతో విడిసిల సమాంతర పాలన కొనసాగుతున్నదని చెప్పారు. నిజామాబాద్‌లో అనేక గ్రామాల్లో సంఘ బహిష్కరణలు చేసినా, శ్రీరాముని ఆలయానికి వెళ్లే హిందూ మహిళలను అడ్డుకున్నా.. స్థానిక బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ గానీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌గానీ స్పందించడం లేదని తెలిపారు. రజకలు, వడ్డెరలు, ముదిరాజ్‌లు, గౌడ్‌లు ప్రతి కులం ఏదో ఒక గ్రామంలో బాధితులుగా మారుతున్నారని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా ప్రజాసంఘాలు, సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు.

పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ మహారాష్ట్రలో మాదిరిగా తెలంగాణలోనూ విడిసిలను వెంటనే రద్దు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణలో దాదాపు 50 నుంచి 60 నియోజకవర్గాల పరిధిలో వెయ్యికిపైగా గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. సర్పంచ్, ఎంపిటిసి తదితర గ్రామపాలన కోసం వచ్చే ప్రాతినిధ్యంలో రిజర్వేషన్ అమలు తర్వాత తమ పెత్తందారీతనాన్ని నిలబెట్టుకునేందుకు విడిసిలను బలోపేతం చేసుకున్నారని ఆరోపించారు.

హిందువులపై భూస్వాములు దౌర్జన్యం చేస్తున్నా బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు నోరు మెదపడంలేదని విమర్శించారు. బహిష్కరణకు పాల్పడ్డ వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం రాజకీయ పార్టీలు భయపడుతున్నాయనీ, గెలిపించే ఓట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీల వద్ద ఉన్నాయే తప్ప వీడీసీల వద్ద కాదని స్పష్టం చేశారు.

గవర్నర్‌తో బిసి సంఘాల భేటీ

- బిసి బిల్లు ఆమోదం పొందేలా కేంద్రంతో మాట్లాడాలని వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యాన బిసి సంఘాల ప్రతినిధుల బృందం భేటీ అయింది. బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో వారు గవర్నర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పంపిన బిసి బిల్లును తక్షణమే ఆమోదించి తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్లో చేర్చేలా కేంద్రంతో మాట్లాడాలని ఈ సందర్భంగా బిసి నేతలు గవర్నర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి. మనిమంజరి సాగర్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్ కాలనీలో తండ్రి తన ఇద్దరు పిల్లల్ని చంపి తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండాపూర్ సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గారకుర్తి గ్రామానికి చెందిన బాయికాడి సుభాష్ (45)కు భార్య మంజుల, కొడుకు మరియన్ (13), కూతురు ఆరాధ్య (9) ఉన్నారు. కాగా, భార్యపై అనుమానంతో భర్త ఇంటి ఆవరణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. మంజుల వేరే వారితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటంతో వారి ఇద్దరి మధ్య కలహాలు ఏర్పడి ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. దాంతో సుభాష్ తీవ్ర మనస్థాపానికి గురై.. మరియన్, ఆరాధ్య.. తనకు పుట్టలేదని భావించి మొదట తన ఇద్దరు పిల్లలను "బండరాయితో" కొట్టి చంపి, తానూ ఉరేసుకున్నారు. అయితే, సోమవారం సుభాష్ ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు 100కు కాల్ చేసి సమాచారం అందించారు. సుభాష్ సూసైడ్ నోట్ రాసి చనిపోవడంతో ఆ నోట్‌ను సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

వైద్యం కోసం వస్తే అబార్షన్ చేశారు

- కవలలను కడుపులోనే చంపారు
- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన
- ప్రయివేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన డిఎంహెచ్‌ఒ
- డాక్టర్ అనూషరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం విజయలక్ష్మీ హాస్పిటల్‌లో దారుణం చోటుచేసుకుంది. వైద్యం వికటించి కడుపులోనే కవలలు మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే కవలలు మృతి చెందారని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. జిల్లా వైద్యాధికారి ఆస్పత్రిని సందర్శించారు. అందులో ఉన్న రోగులను ఇతర ఆస్పత్రులకు తరలించి, ఆస్పత్రిని సీజ్ చేశారు. డాక్టర్‌ను ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన బుట్టి కీర్తి ఐదు నెలల గర్భిణి. ఏడేళ్ల తరువాత గర్భం దాల్చారు. ప్రతి నెలా ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రిలోనే వైద్యం తీసుకుంటున్నారు. కాగా, ఆమెకు ఆదివారం తీవ్ర కడుపునొప్పి రావడంతో ఉదయం 6.30 గంటలకు ఆస్పత్రికి తీసుకొచ్చారు. కీర్తి కుటుంబ సభ్యులు డాక్టర్ అనూషారెడ్డికి ఆమె పరిస్థితిని ఫోన్‌లో వివరించారు. కానీ డాక్టర్ 11 గంటలకు వచ్చారు. అప్పటికే గర్భిణికి నర్సులు వైద్యం మొదలు పెట్టారు. డాక్టర్ వాట్సాప్ వీడియో కాల్ ద్వారా ఆ గర్భిణికి వైద్యం అందిస్తుండగా తీవ్ర రక్తస్రావం జరిగి కవలలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ హుటాహుటిన ఆస్పత్రికి వచ్చి గర్భిణీకి కావాల్సిన వైద్యం అందించారు.

బంధువుల ఆందోళన..

ఆస్పత్రి డాక్టర్ నిర్లక్ష్యం వలనే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ కవలల తల్లిదండ్రులు, బంధువులు సోమవారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. గర్భంలోనే కవలలు మృతి చెందారని, రూ.30వేల బిల్లు చెల్లించి వెళ్లిపోవాలని ఆస్పత్రి సిబ్బంది డిమాండ్ చేశారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం, స్టాఫ్ నర్సులు తెలిసి తెలియని వైద్యంతో గర్భంలోనే కవలలు చనిపోయారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితులకు సర్దిచెప్పారు. అర్హత లేని వైద్యులతో అమాయకపు ప్రజలకు చికిత్సలు చేయించి లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఆస్పత్రిని సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి

ఈ ఘటనపై ఆస్పత్రిలో విచారణ జరిపిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులను ఇతర ఆస్పత్రులకు తరలించారు. అర్హత లేకుండా వైద్య చికిత్సలు నిర్వహించటం, గర్భిణీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి తెలిపారు. ఆస్పత్రి డాక్టర్ అనూషారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఇబ్రహీంపట్నం సీఐ జగదీష్ తెలిపారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల రోజువారీ కూలీలు ఇద్దరు వడదెబ్బకు గురై సోమవారం మృతిచెందారు. ఈ ఘటనలు ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జరిగాయి. ఖమ్మం కైకొడాయి గూడెం ప్రాంతానికి చెందిన బొల్లపు శ్రీనివాస్ రెడ్డి(47) బల్లెపల్లి ప్రాంతంలో ఉన్న ప్రయివేటు యుపివిసి ఇండస్ట్రీలో రోజువారీ కూలీ పనికి వెళ్తాడు. సోమవారం పనికి వెళ్లి సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. వడదెబ్బ తగలడం వల్ల మూడ్రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్ రెడ్డి సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్టు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని సిపిఎం ఖానాపురం హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు.

ఉపాధి కార్మికురాలు మృతి

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని ఆదిరాల గ్రామానికి చెందిన మొల్కలపల్లి నరసమ్మ (50) ఉపాధి హామీ పనులకు వెళ్లారు. రోజు మాదిరిగానే ఈ నెల 3వ తేదీ పనికి వెళ్లారు. ఈ క్రమంలో ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైంది. మండల కేంద్రంలోని అస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతు మరణాలు

- ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటు
- నంగునూర్ మండలంలో దెబ్బతిన్న మామిడి తోటల పరిశీలన


మామిడి తోటలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడా కూడా ధాన్యం కొనడం లేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం రైతులు ఎదురుచూసే దయనీయ పరిస్థితిల్లో ఉన్నారని, ఆ క్రమంలో కొనుగోలు కేంద్రాల్లో రైతు మరణాలు జరుగుతున్నాయని, ఇవి ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో ఆయన సోమవారం పరిశీలించి, రైతులను పరామర్శించారు.

అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూరు వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జలపతిరెడ్డి అనే రైతు మృతి చెందారని, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో హనుమండ్ల ప్రేమలత అనే మహిళా రైతు హఠాన్మరణం చెందారని, ఏప్రిల్ 22న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి కొనుగోలు కేంద్రంలో బీరు వెంకన్న, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు కొనుగోలు కేంద్రంలో చింతకింది హనుమయ్య మరణించారని తెలిపారు. ధాన్యపు రాశులే సాక్ష్యంగా, కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనన్నారు.

ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యత వహించాలని అన్నారు. సాగు నీళ్లు అందించడంలో, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కాంటాలు పెట్టడంలో, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో, బోనస్ అందజేయడం లో ఘోర వైఫల్యం చెందారన్నారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. అన్నదాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు 10 రోజులు దాటుతున్నా రైతులకు చెల్లించడం లేదన్నారు. 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటి వరకు 24.43 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. దీని విలువ రూ.5664 కోట్లు అని, చెల్లించింది రూ.3163 కోట్లు మాత్రమేనని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో వెంటనే పంట నష్టం అంచనా వేయాలని, నష్ట పోయిన రైతులకు పంట నష్టం చెల్లించాలని, తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో మాట్లాడు తున్న సమయంలో లారీలు అందుబాటులో లేవని, హమాలీలు సరిపోవడం లేదని రైతులు హరీశ్ రావు దృష్టికి తీసుకురాగా.. ఆయన సంబంధిత వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మామిడి తోటల పరిశీలన

సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలంలోని దర్గపల్లి గ్రామంలో అకాల వర్షానికి నష్టపోయిన మామిడి తోటలను హరీశ్‌రావు పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో 1,800 ఎకరాల్లో మామిడి పంటలకు నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ, హార్టికల్చర్, రెవెన్యూ శాఖ అధికారులు ఎన్యుమరేషన్ చేసి తక్షణమే సహాయం అందించాలని కోరారు. రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలన్నారు. మునుపెన్నడూ చూడని విధంగా తీవ్రమైన గాలితో వర్షం కురిసిందని.. దాంతో వరి, పండ్లతోటలు సహా అన్ని పంటలు నష్టపోయారని అన్నారు.

తెలుగు వర్సిటీ పిహెచ్‌డి అడ్మిషన్లలో అక్రమాలు!

- అనర్హులను ఎంపిక చేసిన వైనం
- నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఉద్యోగికి రెగ్యులర్ సీటు
- విచారణ జరపాలంటున్న విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం (ఎస్‌పిటియు) పిహెచ్‌డి ప్రవేశాల్లో అక్రమాలు జరిగినట్టు పెద్దఎత్తున విమర్శలొస్తున్నాయి. అనర్హులకు పిహెచ్‌డి ప్రవేశాలు కల్పించినట్టు తెలుస్తున్నది. ఓ ప్రభుత్వ ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ ప్రాతిపదికన సీటు ఇచ్చేందుకు ఎంపిక చేయడం వివాదానికి దారితీసింది. ఆ ఉద్యోగికి ఎంఫిల్, నెట్ వంటి అర్హతలు కూడా లేవు. ఇంకో వైపు ప్రవేశ పరీక్షలో ఆ ఉద్యోగికి 41 మార్కులే వచ్చాయి. ఆమె కంటే ఎక్కువ మార్కులను సాధించిన వారిని పక్కనపెట్టి ఆమెను ఎంపిక చేయడంలో ఆంతర్యమేంటన్నది తెలియాల్సి ఉంది. ఆమె బిసి మహిళ కాబట్టి ఎంపిక చేశామంటూ వర్సిటీ అధికారులు బుకాయిస్తున్నాయి. అయితే, ఆమె కంటే ఐదుగురు బిసి మహిళలు ఎక్కువ మార్కులను సాధించారు. అయినప్పటికీ ఆ ఉద్యోగినే ఎంపిక చేయడం గమనార్హం. ఆ ఉద్యోగి పని చేస్తున్న తెలుగు అకాడమి నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌ఒసి) తీసుకోవాలి. కానీ ఆమె ఎన్‌ఒసిని సమర్పించలేదని తెలిసింది. ఈ ఘటనల ఆధారంగా తెలుగు విశ్వవిద్యాలయం పిహెచ్‌డి ప్రవేశాల్లో అవకతవకలు జరిగినట్టు స్పష్టమవుతున్నది.

గుట్టుగా నోటిఫికేషన్ జారీ

తెలుగు విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ప్రాతిపదికన 2023-24 విద్యా సంవత్సరంలో పిహెచ్‌డి ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను ఈ ఏడాది జనవరి 30న విడుదల చేసింది. ప్రముఖ దినపత్రికల్లో ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా ఎవరికీ అందుబాటులో లేని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పొందుపర్చకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిబ్రవరి పదో తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించింది. అయితే ఎన్ని పీహెచ్‌డీ సీట్లకు ప్రవేశాలను కల్పిస్తారో, ఏయే రిజర్వేషన్ల వారికి ఎన్ని సీట్లు ఉన్నాయో ప్రకటించలేదు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు విద్యార్థులకు హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. పీహెచ్‌డీ పరీక్షను సరైన పద్ధతిలో నిర్వహించలేదు. ఓఎంఆర్‌ను కూడా పాతది ఇచ్చారు. వంద మార్కుల ప్రశ్నాపత్రం ఇవ్వాల్సి ఉంటే 50 మార్కులకే ఇచ్చారు. మిగతా 50 మార్కుల గడులను కొట్టేశారు. ఇదేంటని విద్యార్థులు ఇన్విజిలేటర్లను ప్రశ్నిస్తే కొట్టేసిన ఆ 50 గడులను కూడా నింపాలని సమాధానమిచ్చారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నుంచి పరీక్ష నిర్వహణ వరకు అంతా అస్తవ్యస్థంగా సాగింది. దీంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు.

ప్రాస్పెక్టస్‌కు భిన్నంగా ఎంపిక

ఈ ఏడాది మార్చి 17 నుంచి 20వ తేదీ వరకు పిహెచ్‌డి ప్రవేశాలకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. అది కూడా విద్యార్థుల ప్రతిభను పరీక్షించలేదు. గతనెల 15న తాత్కాలికంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ప్రాస్పెక్టస్‌కు భిన్నంగా ఎంపిక చేయడం పలు విమర్శలకు తావిచ్చింది. ఆ ప్రాస్పెక్టస్‌లో జాతీయ స్థాయిలో ఫెలోషిప్‌నకు ఎంపికైన వారు, యూజీసీ నెట్, ఎంఫిల్ ఉన్న వారిని మొదటి కేటగిరీలో ఎంపిక చేయాలని ఉన్నది. అయినా మిగిలితేనే రెండో కేటగిరీ వారికి పరీక్ష నిర్వహించి సీట్లివ్వాలని పేర్కొంది. ప్రాస్పెక్టస్‌లో ప్రకటించిన నిబంధనలకు విరుద్ధంగా మొదటి కేటగిరీ వారికి సీట్లు కేటాయించకుండా తెలుగు వర్సిటీ అధికారులు మొండిచేయి చూపించారు.

సమగ్ర విచారణ జరపాలి : ఎస్‌ఎఫ్‌ఐ

తెలుగు విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ సీట్ల కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, కార్యదర్శి టి నాగరాజు కలిసి విజ్ఞప్తి చేశారు. వర్సిటీ స్వయంగా విడుదల చేసిన ప్రాస్పెక్టస్‌కి పూర్తి విరుద్ధంగా పీహెచ్‌డీ సీట్ల కేటాయింపు జరిగిందని విమర్శించారు. అర్హులైన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.